సాక్షి ఒడిశా
బుధవారం । 27 । సెప్టెంబర్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.4,82,370
బంగారం	2 గ్రాముల 550 మిల్లీ గ్రాములు
వెండి	22 గ్రాముల 300 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/ పూరీ



శాసన సభలో రసాభాస

వర్షాకాల సమావేశాలు పురస్కరించుకుని శాసన సభలో గందరగోళ పరిస్థితి నెలకొంది. మంగళవారం సభ ఆరంభం నుంచే రసాభాస మొదలైంది. - IIలో▸



రాష్ట్రవ్యాప్తంగా జైలు ఉద్యోగుల నిరాహార దీక్షలు

తమ దీర్ఘకాల సమస్యల పరిష్కారానికి కారాగార సిబ్బంది రాష్ట్రవ్యాప్తంగా ఆమరణ నిరాహార దీక్షలు చేపట్టారు. - IIలో▸

బీజేడీలో... ఆమెకు వందనం..!



- పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఆమోదం
- ఇదివరకే బీజేడీలో అమలు చేస్తున్న సీఎం నవీన్ పట్నాయక్
- దేశంలో 2029 నుంచి అమలులోకి వచ్చే అవకాశం

భువనేశ్వర్:

భారత ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదించిన విషయం తెలిసిందే. రాష్ట్ర శాసనసభలు, పార్లమెంట్‌లో మొత్తం సీట్లలో 33 శాతం మహిళలకు మూడింట ఒక వంతు రిజర్వేషన్ కల్పించేందుకు ఆమోదం లభించింది. ఈ బిల్లుపై దశాబ్ద కాలంగా వివిధ రాజకీయ పార్టీలు వివిధ సమయాల్లో దృష్టి సారించినప్పటికీ ఆచరణకు నోచుకోలేదు. గతంలో 2008లో ప్రతిపాదించిన చట్టాన్ని 2010లో ఎగువ సభ ఆమోదించినప్పటికీ, రాజకీయ ఏకాభిప్రాయం లేకపోవడం మరియు 15వ లోక్‌సభ రద్దు కావడం వల్ల బిల్లు చట్టంగా మారలేదు. అయితే ప్రస్తుతం బిల్లు ఆమోదించబడడం చరిత్రాత్మకం. కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రకారం లోక్‌సభలో మొత్తం 542 మందిలో ప్రస్తుతం 78 మంది మహిళలు ఉన్నారు. రాజ్యసభలో 224 మంది సభ్యుల్లో 24 మంది మహిళలు ఉండగా.. కేవలం 6 మంది మహిళలకు మాత్రమే పీఎం నరేంద్రమోదీ కొలువులో మంత్రి స్థానం దక్కింది. రాష్ట్ర శాసన సభల్లో లింగ వైవిధ్యం మరింత ఎక్కువగా ఉంది. అయితే ఈ బిల్లు అమలులోకి వస్తే మహిళా ప్రజాప్రతినిధులకు అగ్రస్థానం లభించనుంది.

రాష్ట్రంలో మహిళా ఎమ్మెల్యేలు

2019 సంవత్సరంలో రాష్ట్రంలో 146 స్థానాలకు ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికల్లో బీజేడీ 33 శాతం రిజర్వేషన్లు కల్పించినా, మిగతా పార్టీలు సీట్లు కేటాయించకపోవడంతో 13 మంది మహిళా అభ్యర్థులు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. అప్పుడు రాష్ట్ర శాసనసభలో వీరి ఉనికి 8.9 శాతంగా నమోదైంది. 2019 సార్వత్రిక ఎన్నికల తర్వాత రాష్ట్రంలో 8 నియోజకవర్గాల్లో ఉప ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికల్లో అధికార బీజేడీ 6 మంది మహిళా అభ్యర్థులను బరిలోకి దింపింది. వరుసగా జరిగిన ఉప ఎన్నికల్లో మహిళల ప్రాతినిధ్యం 66 శాతంగా నిలిచింది. పటకురా, బిజేపూర్, బ్రజ్‌రాజ్ నగర్, పదమపూర్, ఝూర్సుగుడ, ధామ్‌నగర్ శాసన సభ నియోజకవర్గాల్లో ఉప ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికల్లో ధామ్‌నగర్ నుంచి బీజేడీ బరిలోకి దింపిన మహిళా అభ్యర్థి అవాంతి దాస్ మినహా మిగిలిన 5 మంది అభ్యర్థులు విజేతలుగా నిలిచారు. వీరంతా బిజూ జనతా దళ్ అభ్యర్థులు కావడం విశేషం. సావిత్రి అగర్వాల్ (పటకురా), రీతా సాహు (బిజేపూర్), అలకా మహంతి (బ్రజ్‌రాజ్ నగర్), బొర్షా సింగ్ బొరిహా (పదమ పూర్), దీపాలి దాస్ (ఝూర్సుగుడ) సరికొత్త ముఖాలుగా రాష్ట్ర శాసన సభకు ఎన్నికయ్యారు. ఈ 5 మంది అభ్యర్థులు ఎమ్మెల్యేలుగా విజయం సాధించడంతో రాష్ట్ర శాసనసభలో మహిళా ఎమ్మెల్యేల సంఖ్య 18కి చేరింది.

ముందంజలో ఒడిశా

రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ నేతృత్వంలోని బిజూ జనతా దళ్ (బీజేడీ) రాష్ట్రంలో మహిళా రిజర్వేషన్ ఆచరణాత్మకంగా అమలు చేస్తుండడం అభినందనీయం. అలాగే దేశంలో మహిళా రిజర్వేషన్ కోసం విస్తృత ప్రచారం చేపట్టిన విషయం తెలిసిందే. నవీన్ దృఢ సంకల్పం కేంద్ర మంత్రి మండలి ఆమోదంతో పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రవేశం కావడం జాతీయ స్థాయిలో వాస్తవ ప్రభావానికి అద్దం పట్టింది. 2018లో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఒడిశా అసెంబ్లీలో చట్టసభలు మరియు పార్లమెంటులో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కోరుతూ ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. శాసన సభలు మరియు పార్లమెంట్‌లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని చారిత్రాత్మక తీర్మానం చేయడం అత్యంత చైతన్యవంతమైన చర్యగా మన్ననలు పొందింది.

సత్వర కార్యాచరణ

2019 సంవత్సరంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో బిజూ జనతా దళ్ (బీజేడీ) 33 శాతం మహిళా అభ్యర్థులకు టిక్కెట్లు కేటాయించి ఆచరణాత్మకత చాటుకుంది. ఈ చర్య జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకుంది. ఈ చర్యపై ఐక్యరాజ్య సమితి సైతం ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌ని అభినందించింది. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ పార్లమెంట్, రాష్ట్ర అసెంబ్లీల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించడం, ఇతర రాష్ట్రాలను ప్రేరేపించి అలాంటి నిబద్ధత జాతీయ స్థాయిలో మహిళా రిజర్వేషన్ అంశంపై చర్చను పునరుద్ధరించే అవకాశం ఉందని ఐక్యరాజ్య సమితి మహిళా డిప్యూటీ కంట్రీ ప్రతినిధి నిష్ఠా సత్యం అప్పట్లో పేర్కొనడం విశేషం. 2018 సంవత్సరం నవంబర్ 20న మహిళా రిజర్వేషను ప్రతిపాదించి, సభ తీర్మానం పొందడంలో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సరికొత్త చరిత్రకు తొలిసారిగా శ్రీకారం చుట్టారు. వెంబడి 2018 డిసెంబర్ నెలలో పార్లమెంట్ మరియు రాష్ట్ర శాసన సభలలో మహిళలకు మూడింట ఒక వంతు (33 శాతం) రిజర్వేషన్ కల్పించాలని భారత ప్రధానమంత్రికి లేఖ రాశారు.

జనాభా లెక్కింపు తర్వాతే..

పార్లమెంటులో ప్రస్తుతం ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ బిల్లు అమలులోకి వచ్చిన తర్వాత నిర్వహించిన మొదటి జనాభా లెక్కింపు ప్రకారం సరిహద్దు పునర్విభజన ఆధారంగా అమలు చేయాలని ప్రతిపాదించబడింది. ఇది 2008 మరియు 2023 బిల్లుల మధ్య కీలక వ్యత్యాసం. ఇప్పుడు ప్రతిపాదించబడిన రాజ్యాంగ సవరణ 2024 లోక్‌సభ ఎన్నికలపై లేదా దేశం ఎన్నుకునే కొత్త ప్రతినిధులలో మహిళల ప్రాతినిధ్యంపై ప్రభావం చూపదు. వచ్చే ఏడాది జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు ముందు జనాభా లెక్కింపు కష్టతరం. స్వల్ప నిడివిలో ఈ బృహత్కార్యాచరణ అసాధ్యం. లెక్క ప్రకారం వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి ఏ క్షణంలోనైనా జమిలి ఎన్నికలు జరిగే అవకాశం ఉంది.

సుప్రీం నిలదీత

మహిళా రిజర్వేషన్ల విషయంలో తమ వైఖరిని స్పష్టం చేయకపోవడంపై నెల రోజుల క్రితం సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. చట్ట సభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ 2021 సంవత్సరంలో దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై ఎందుకు స్పందించలేదని కేంద్ర ప్రభుత్వాన్ని కోర్టు ప్రశ్నించింది. ఆగస్టు 11న జరిగిన విచారణలో జస్టిస్‌లు సంజీవ్ ఖన్నా మరియు ఎస్.వి.ఎన్.భట్టిలతో కూడిన ధర్మాసనం కేంద్ర న్యాయ అధికారిని కోరింది. మహిళా రిజర్వేషన్ బిల్లును లోక్‌సభలో తిరిగి ప్రవేశపెట్టాలని కోరుతూ భారతీయ మహిళ జాతీయ సమాఖ్య (నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఉమెన్ – ఎన్‌ఎఫ్ఐడబ్ల్యూ) 2021లో ఈ పిటిషన్‌ను దాఖలు చేసింది.

న్యూస్‌రీల్

రహదారి నియమాలు తప్పనిసరి



ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించినవారి ఫొటోలు విడుదల చేసిన పోలీసులు

రాయగడ: వాహన చోదకులు తప్పనిసరిగా రహదారి నియమాలు పాటించాలని పోలీసులు స్పష్టం చేశారు. నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడుపుతున్న వారిపై కొరడా ఝుళిపించారు. పట్టణంలో వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమేరాల ఆధారంగా గడిచిన 24 గంటల్లో 56 కేసులను నమోదు చేశారు. దీనికి సంబంధించి రూ.1,04,000లు అపరాధ రుసుం కింద వసూలు చేశారు. వాహనం నడిపే సమయంలో సెల్‌ఫోన్ వాడడం, ట్రిపుల్ రైడింగ్, ట్రాఫిక్ నియమాల ఉల్లంఘన తదితర వాటిపై చర్యలు తీసుకున్నారు.

భారిజోలలో పన్నుల వసూళ్ల శిబిరం



పన్నులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

రాయగడ: స్థానిక భారిజోల గ్రామంలో రెవెన్యూ పన్నుల వసూళ్ల శిబిరం మంగళవారం జరిగింది. తహసీల్దార్ ప్రియదర్శిని స్వాయి, సూపర్‌వైజర్ దేవి ప్రసాద్ మల్లిక్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ రథ్, అసిస్టెంట్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రజితా బెహర, కె.శాంతికుమారి తదితర సిబ్బంది పాల్గొన్నారు. గ్రామంలోని 32 మంది నుంచి ఇంటి పన్ను, నీటి పన్ను తదితర రూపంలో రూ.35 వేల పన్నులు వసూలు చేశారు. ఇదివరకు పన్నులను చెల్లించేందుకు గ్రామస్తులు తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లేవారు. దీంతో గ్రామస్తులకు మరింత సౌకర్యం కల్పించేందుకు అధికారులే గ్రామాలకు వెళ్లి ఇటువంటి తరహా శిబిరాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

హత్య కేసులో ఇద్దరు అరెస్టు



నేరస్తులను చూపిస్తున్న పోలీసులు

బరంపురం: పాత కక్షలతో ఒక యువకుడిని హత్యచేసిన ఘటనలో ఇద్దరు నేరస్తులను పోలీసులు అరెస్టు చేశారు. ఐఐసీ అధికారి తపన్ కుమార్ మిశ్రా తెలిపిన వివరాలు మేరకు.. గంజాం జిల్లా పట్టాపూర్ పోలీసుస్టేషన్ పరిధి కిరండమా అటవీ ప్రాంతంలో ఈనెల 23వ తేదీన సునీల్ నాయక్‌ని గొంతుకోసి హత్య చేసిన ఘటన చోటుచేసుకుంది. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. హత్యలో ఇద్దరి ప్రమేయం ఉన్నట్లు నిర్ధారించారు. మంగళవారం ఇద్దరు నేరస్తులను అరెస్టు చేసి, హత్యకి వినియోగించిన కత్తి, హాకీ స్టిక్ సీజ్ చేశారు. అరెస్టైనవారిలో పట్టపూర్‌కి చెందిన కన్ను దొళాయి, ఎస్.మల్లేష్ పాత్రోలు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.

బైకు దొంగతనం కేసులో ఒకరు అరెస్టు



పోలీసులకు చిక్కిన నిందితుడు

రాయగడ: బైకు దొంగతనం కేసులో బిసంకటక్ పోలీసులు ఒకరిని అరెస్టు చేసి మంగళవారం కోర్టుకు తరలించారు. అరెస్టైన వ్యక్తి జిల్లాలోని కాసీపూర్ పోలీసుస్టేషన్ పరిధి లక్రి గ్రామానికి చెందిన రంజన్ నాయక్‌గా గుర్తించారు. వివరాల్లోకి వెళ్తే.. ఈనెల 23వ తేదీన బిసంకటక్‌లోని మా మార్కామా వీధిలో నివసిస్తున్న గణపతి పొరిఛా అనే వ్యక్తి తన బైక్‌ను హనుమాన్ మందిరం ఎదుట ఉంచి ఏదో పనిమీద వెళ్లాడు. తిరిగి వచ్చి చూసేసరికి తన బైకు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు సోమవారం సాయంత్రం చాటికొన గ్రామంలో నిందితుడు నాయక్‌తో పాటు బైక్‌ను పట్టుకున్నారు.

మూడో రోజుకు జర్నలిస్టుల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నాలో కూర్చున్న విలేకరులు

పర్లాకిమిడి: రాయఘడ బ్లాక్ ఎలక్ట్రానిక్ మీడియా రిపోర్టర్లపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడంతో జిల్లా ప్రెస్‌క్లబ్ మద్దతుతో కలెక్టరేట్ ఎదుట నిర్వహిస్తున్న జర్నలిస్టుల ధర్నా మంగళవారం నాటికి మూడో రోజుకు చేరుకుంది. జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు దీక్ష చేస్తున్న జర్నలిస్టులకు సంఘీభావం తెలిపారు. రాయఘడ బ్లాక్‌లోని ఒడిశా జీవనోపాధుల శాఖ ఏబీడీవో లతికా దేవిని పిలిపించి మాట్లాడినట్లు తెలిపారు. ప్రభుత్వం అందజేసిన మేకల పంపిణీ పథకంలో అవకతవకలు రుజువైతే తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని హామీ ఇచ్చారు. కాగా రాయఘడ బ్లాక్‌లో మేకల పంపిణీలో జరిగిన అవినీతిపై దర్యాప్తు చేయాలని, బ్లాక్ అధికారి లతికా దేవి విలేకరులపై పెట్టిన కేసును వెనక్కి తీసుకోవాలని, మరో రెండు డిమాండ్లపై ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్నారు. శిబిరంలో జగదీష్ పండా, రశ్మిరంజన్ మిశ్రా, రాయఘడ బ్లాక్ విలేకరులు జితేంద్రపాత్రో, ధనేశ్వర్ నాయక్, సంతోష్ పట్నాయిక్ తదితరులు పాల్గొన్నారు.



జర్నలిస్టులకు మద్దతు తెలుపుతున్న జిల్లా పరిషత్ అధ్యక్షుడు తిరుపతిరావు

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

- ఎంపీ సప్తగిరి ఉలక డిమాండ్



డొంగాశిలి గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంపీ ఉలక తదితరులు

రాయగడ: జిల్లాలో కాసీపూర్ సమితి డొంగాశిలి గ్రామంలోని ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న మూడో తరగతి విద్యార్థినిపై అత్యాచార కేసులో నిందితుడిని కఠినంగా శిక్షించి, ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా న్యాయం చేయాలని కొరాపుట్ లోక్‌సభ ఎంపీ సప్తగిరి ఉలక డిమాండ్ చేశారు. పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. అనంతరం గ్రామంలోని ప్రజలతో సమావేశమయ్యారు. అభం, శుభం తెలియని చిన్నారిపై ఇటువంటి అఘాయిత్యం జరగడం బాధాకరమన్నారు. నవీన్ పట్నాయక్ ప్రభుత్వ వైఫల్యానికి ఇదొక నిదర్శనమని ఆరోపించారు. ఘటనలో పోలీసుల బస్సును తగలబెట్టిన విషయంలో అమాయకులపై కేసులు నమోదు చేసి అరెస్టు చేయడం విచారకరమన్నారు. అనంతరం రాయగడ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలిని, ఆమె తల్లిదండ్రులను పరామర్శించారు. ఆయనతో పాటు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బిజయ్ కుమార్ గొమాంగో, పీసీసీ ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్ పండ, ఆదివాసీ మహా సంఘం అధ్యక్షుడు అప్పలస్వామి కద్రక, కాసీపూర్ సమితి కాంగ్రెస్ అధ్యక్షుడు అంగద్ నాయక్, పీసీసీ మహిళా విభాగం రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షురాలు రత్నమణి ఉలక తదితరులు ఉన్నారు.

సెంచూరియన్ వర్సిటీలో అడ్మిషన్లకు దరఖాస్తులు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: స్కిల్ ఇంటిగ్రేటెడ్ ఉన్నత విద్యలో నీతి ఆయోగ్ ప్రశంసించిన సెంచూరియన్ వర్సిటీలో 2024 సంవత్సరానికి సంబంధించి వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు ఆసక్తి గల విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ మేరకు వర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ సుప్రియా పట్నాయక్, డైరెక్టర్ (అడ్మిషన్స్ మరియు మార్కెటింగ్) సుకాంత పరిడాలు ఒక పోస్టర్‌ను మంగళవారం విడుదల చేశారు. సెంచూరియన్ వర్సిటీలో 63 ప్రోగ్రాంలు, 14 స్కూల్స్ ఉన్నాయి. వీరి క్యాంపస్‌లు పర్లాకిమిడి, ఖుర్దా, బాలసోర్, బలంఘీర్, రాయఘడ, ఛత్రపూర్, విజయనగరంలో ఉన్నట్లు పేర్కొన్నారు. కొత్తగా అగ్రికల్చర్ కోర్సులో డైరీ టెక్, ఫిటో ఫార్మా, బయో ఇంజినీరింగ్, హెల్త్ సైన్స్, ఫోరెన్సిక్ సైన్సు, సైబర్ సెక్యూరిటీ, యానిమేషన్, మల్టీమీడియా, వెటర్నరీ, యానిమల్ హజ్బెండరీ, మారీటైంతో పాటు ఇంజినీరింగ్, ఆక్వా రంగాల్లో వివిధ కోర్సులు అందుబాటులోకి వచ్చినట్లు వెల్లడించారు. మరిన్ని వివరాలకు www.cutm.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

ఆరుగురు పేకాటరాయుళ్లు అరెస్టు




పోలీసులకు పట్టుబడిన పేకాటరాయుళ్లు



స్వాధీనం చేసుకున్న నగదు, సెల్‌ఫోన్లు, పేక ముక్కలు

బరంపురం: నగరానికి సమీపంలోని ఒక ఇంటిలో నిర్వహిస్తున్న జూదం అడ్డాపై పోలీసులు దాడి చేశారు. ఐఐసీ అధికారి సుమిత్ సరన్ తెలిపిన వివరాలు మేరకు.. నగరంలోని బీఎన్‌పూర్ పోలీసుస్టేషన్ పరిధి బైకుంఠ నగర్ 2వ లైన్‌లోని ఒక ఇంటిలో రహస్యంగా గత కొద్దిరోజుల నుంచి జూదం అడ్డా నడుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు మంగళవారం జూదం అడ్డాపై దాడిచేసి ఆరుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. వారి దగ్గర నుంచి రూ.1.27 లక్షల నగదు, 3 సెల్‌ఫోన్లు, 2 పేక కట్టలు సీజ్ చేశారు.

4 ద్వారాలు తెరవాలని డిమాండ్



- అక్టోబర్ 3న రాష్ట్ర బంద్

భువనేశ్వర్: భక్తుల కోసం శ్రీమందిరం 4 ద్వారాలు తెరవాలనే వాదన క్రమంగా బలపడుతోంది. ఈ డిమాండ్‌తో శ్రీజగన్నాథ సేన రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చింది. అక్టోబర్ 3న రాష్ట్రంలో శాంతియుతంగా బంద్ నిర్వహిస్తామని శ్రీజగన్నాథ్ సేన అధినేత ప్రియదర్శి పట్నాయక్ పిలుపునిచ్చారు. భక్తులకు ధర్మ, అర్థ, కామ, మోక్షం తదితర వాటి కోసం శ్రీజగన్నాథుని ఆలయం నాలుగు ద్వారాలు వెంటనే తెరవాలని డిమాండ్ చేశారు. అలాగే శ్రీమందిరం రత్న భాండాగారం తెరిచి ఆభరణాల తాజా స్థితిగతులను బహిరంగపరచాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సేన సభ్యులు ఆదివారం పూరీ జిల్లా కలెక్టర్ సమర్థ వర్మాతో సమావేశమై చర్చించారు. అయితే చర్చ విఫలం అయిందని అధ్యక్షుడు ప్రియదర్శి పట్నాయక్ తెలిపారు. శ్రీమందిర్ పరిక్రమ ప్రాజెక్టు పూర్తయిన తర్వాత భక్తుల కోసం 4 ద్వారాలు తెరవబడతాయని జిల్లా మేజిస్ట్రేట్ హామీ ఇచ్చారు. ప్రాజెక్టు పనులు మందకొడిగా సాగుతుండడంతో ఈ పనులు ఎప్పటికి పూర్తవుతాయోనన్న సందిగ్ధత నెలకొంది. కాబట్టి 72 గంటల్లోగా అధికార వర్గాలు లిఖితపూర్వక హామీ వెలువడకపోతే ఒడిశా బంద్ ఆందోళన చేపడతామని స్పష్టం చేశారు.

గంజాంలో బీజేపీ అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న అధ్యక్షుడు భిభుతి జెన్నా




సమావేశంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

బరంపురం: గంజాం జిల్లాలో బీజేపీ అభివృద్ధికి కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు భిభుతి జెన్నా కోరారు. స్థానిక గుసానినువాగం మెయిన్ రోడ్‌లోని జిల్లా బీజేపీ కార్యాలయంలో జిల్లా స్థాయి పార్టీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం గంజాం జిల్లాలో పార్టీ పటిష్టతకు నాయకులంతా కలిసికట్టుగా కృషి చేయాలని కోరారు. సమష్టిగా పనిచేస్తే విజయం తథ్యమని పేర్కొన్నారు. దీనికోసం పార్టీ నాయకులంతా ప్రతీ బ్లాక్‌లో, పంచాయతీల్లో పార్టీ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. దేశవ్యాప్తంగా బీజేపీపై అనుకూల పవనాలు వీస్తున్నాయని, అదేవిధంగా ఒడిశా రాష్ట్రంలోనూ ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారని చెప్పారు. సమావేశంలో కార్యదర్శి మదన్ మోహన్ పాత్రో, సునీల్ సాహు, కైలాస్ సడంగి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వహీదా రెహమాన్‌కు అభినందనలు



భువనేశ్వర్: ప్రతిష్టాత్మక దాదా సాహెబ్ ఫాల్కే అవార్డుకు ఎంపికైన ప్రముఖ నటి వహీదా రెహమాన్‌ను సీఎం నవీన్ పట్నాయక్ అభినందించారు. ఆమె అత్యుత్తమ నటీమణుల్లో ఒకరని, భారతీయ సినిమాకు ఎనలేని సేవలందించారని కొనియాడారు. చిరస్మరణీయమైన పాత్రలతో సినీ ప్రేమికుల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం



ఈఓకు విరాళం అందజేస్తున్న పూతి ఉష

కోటబొమ్మాళి:కొత్తమ్మతల్లి ఆలయంలో నిత్యాన్నదానానికి ఒడిశా ఖుర్దారోడ్డుకు చెందిన పూతి ఉష రూ.50 వేల విరాళాన్ని ఆలయ ఈఓ వి.రాధాకృష్ణకు మంగళవారం అందజేశారు. తన కుమారుడు పూతి రాజేష్ జ్ఞాపకార్థం ఈ మొత్తం అందించినట్లు దాత తెలిపారు.

రైలు ఢీ కొని వ్యక్తి మృతి



ట్రాక్‌పై మృతదేహం

జలుమూరు: తిలారు రైల్వేస్టేషన్ సమీపంలో మంగళవారం రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. జోనంకి పంచాయతీ పరిధి గంగాధరపేటకు చెందిన ముద్దాడ అప్పన్న (38) తిలారు రైల్వేస్టేషన్ సమీపంలో ట్రాక్ దాటుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొట్టి ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు పేర్కొన్నారు. స్థానికులు అందించిన సమాచారం మేరకు జీఆర్పీ కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. మృతుడికి భార్య పావని, కుమారులు అనంత్, శ్రీధర్‌లు ఉన్నారు.

కడపలవాని గెడ్డపై పెరిగిన వరద నీరు



రోడ్డు పై నుంచి ప్రవహిస్తున్న వరదనీరు

ఎల్ ఎన్ పేట: మండలంలోని తురకపేట-దబ్బపాడు గ్రామాల మధ్య ఉన్న కడపలవాని గెడ్డపై వరద నీటి ప్రవాహం పెరిగింది. కొన్ని రోజులు గా కురుస్తున్న వర్షాలకు దేశవాళీ వరద నీరు వచ్చి చేరిందని స్థానిక రైతులు చెబుతున్నారు. వరద నీరు చేరటంతో పంట పొలాలు నీట మునుగుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గెడ్డపై సుమారు అయిదు అడుగుల నీరు ప్రవహించటంతో దబ్బపాడు-తురకపేట గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయని అన్నారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ

సోంపేట: సోంపేట పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ రాధిక మంగళవారం పరిశీలించారు. స్టేషన్ పరిధిలోని పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలనిపోలీసు అధికారులను సూచించారు. వార్షిక తనిఖీల కార్యక్రమంలో రికార్డులు పరిశీలించారు. స్పందన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాశీబుగ్గ డీఎస్పీ నాగేశ్వరరెడ్డి, సీఐ రవి ప్రసాద్, ఎస్ఐ హైమావతి, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

28న సంజ్ఞల భాష దినోత్సవం

శ్రీకాకుళం పాతబస్టాండ్: అంతర్జాతీయ బధిరుల సంజ్ఞల భాషా దినోత్సవం ఈ నెల 28న నిర్వహించనున్నట్లు బధిరుల అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఉంగటి సురేష్, రవికిరణ్‌లు తెలిపారు. కార్యక్రమం ఆ రోజున ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలోని బాపూజీ కళామందిరంలో నిర్వహించనున్నామని, అనంతరం ర్యాలీ ఉంటుందని తెలిపారు.

జిల్లా స్థాయి సాఫ్ట్ టెన్నిస్ స్కూల్‌గేమ్స్ ఎంపిక పోటీలు రేపు

పాతపట్నం: జిల్లాస్థాయి సాఫ్ట్ టెన్నిస్ స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు గురువారం ఉదయం 9గంటల నుంచి నిర్వహిస్తున్నామని జిల్లా సాఫ్ట్ టెన్నిస్ సంఘం అధ్యక్షుడు గురాడి అప్పన్న, గేమ్స్ పర్యవేక్షకులు పీడీ వై.శేఖర్ బాబులు మంగళవారం తెలిపారు. ఈ ఎంపిక పోటీలు మండలంలోని కొరసవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించనున్నామని, అండర్-14, 17 విభాగంలో బాలబాలికలు ఎంపిక పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎస్‌జీఎఫ్ బీవీ రమణ, ప్రధానోపాధ్యాయుడు బి.సింహాచలం, పీఈటీలు పోటీలను నిర్వహిస్తారని సంఘం అధ్యక్షుడు తెలిపారు.

క్రీడలతో విద్యార్థులకు మానసికోల్లాసం



పోటీలకు హాజరైన విద్యార్థులు

● జిల్లా పరిషత్ అధ్యక్షుడు తిరుపతిరావు

పర్లాకిమిడి: క్రీడలతో విద్యార్థులకు మానసిక, శారీరక ఉల్లాసం లభిస్తుందని జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు అన్నారు. గజపతి జిల్లా విద్యాలయాల స్థాయి 2023-24 ఆటల పోటీలు గుమ్మా బ్లాక్ పర్వంబ వద్దనున్న వికాస్ విద్యానికేతన్ మైదానంలో మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా క్రీడా పతాకాన్ని ఆయన ఎగురవేశారు. విద్యార్థులు క్రీడల్లో సత్తా చాటితే ఉత్తమ భవిష్యత్ ఉంటుందని తెలియజేశారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. ఆటల పోటీలకు జిల్లాలోని ఏడు సమితి కేంద్రాల నుంచి 500 మంది విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో గుమ్మా బ్లాక్ అధ్యక్షుడు సునేమీ మండల్, జెడ్పీటీసీ సంధ్యారాణి సాహు, అదనపు బ్లాక్ శిక్షాణాధికారి ఎస్.కృష్ణారావు, వికాస్ విద్యానికేతన్ కార్యదర్శి లాల్‌మోహన్ ఆచార్య, జాజిపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సాత్విక్ పట్నాయిక్, మహేంద్రగిరి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పూర్ణచంద్ర ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడా పతాకాన్ని ఎగురవేస్తున్న తిరుపతిరావు

శాసన సభలో రసాభాస



అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తున్న దృశ్యం (ఫైల్)

● సమావేశాలు రెండుసార్లు వాయిదా

భువనేశ్వర్: వర్షాకాల సమావేశాలు పురస్కరించుకుని శాసన సభలో గందరగోళ పరిస్థితి నెలకొంటుంది. మంగళవారం సభ ఆరంభం నుంచే రసాభాస మొదలైంది. దీంతో స్పీకర్ ప్రమీలా మల్లిక్ సభను రెండుసార్లు వాయిదా వేయడం అనివార్యమైంది. సభ ప్రారంభమైన వెంటనే ప్రశ్నోత్తరాల సమయంలో ప్రతిపక్ష బీజేపీ, కాంగ్రెస్ సభ్యులు గందరగోళం సృష్టించడంతో తొలుత సభ మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా పడింది. వాయిదా అనంతరం సభ ప్రారంభం కాగానే బీజేపీ సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లి పలు అంశాలను లేవనెత్తుతూ నినాదాలు చేశారు. ఫలితంగా సభా కార్యక్రమాలు కొనసాగించడం స్పీకర్‌కు ఇబ్బందిగా మారడంతో, ఆమె రెండోసారి సభను సాయంత్రం 4 గంటల వరకు వాయిదా వేశారు. సభలో ప్రశ్నోత్తరాలు ఉదయం 10.30 గంటలకు సకాలంలో ప్రారంభించినా ప్రతిపక్ష బీజేపీ సభ్యులు తాము లేవనెత్తిన ప్రశ్నలను తోసిపుచ్చారని, చర్చకు అంగీకరించలేదని ఆరోపిస్తూ గందరగోళం సృష్టించారు.

అఖిల పక్ష సమావేశం

సభను వరుసగా వాయిదా వేయాల్సిన పరిస్థితులను చక్కదిద్దేందుకు స్పీకర్ ప్రమీలా మల్లిక్ అఖిలపక్ష సమావేశానికి పిలుపునిచ్చారు. మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేసిన సందర్భంగా స్పీకర్ ఈ సమావేశానికి పిలుపునిచ్చారు. సభ సజావుగా సాగేందుకు అఖిలపక్ష సభ్యులు పూర్తిగా సహకరించాలని అభ్యర్థించారు. ఈ ప్రయత్నం ఫలప్రదం కాలేదు. వెంబడి ప్రారంభమైన సభలో అదే పరిస్థితి యథాతథంగా కొనసాగింది. దీంతో మరోసారి సాయంత్రం 4 గంటల వరకు సమావేశాల్ని వాయిదా వేయాల్సి వచ్చింది.

ప్రభుత్వమే బాధ్యత వహించాలి

అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయం నిర్వీర్యమవుతోందని, ఈ విచారకర పరిస్థితికి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉందని ధామ్‌నగర్ బీజేపీ ఎమ్మెల్యే సూర్యవంశీ సూరజ్ అన్నారు. వివిధ ముఖ్యమైన సమస్యలపై పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన ఆందోళనకారులు స్థానిక దిగువ పీఎంజీ కూడలిలో నిరసన ప్రదర్శిస్తున్నారని గుర్తు చేశారు. సోమవారం, మంగళవారం జరిగిన సమావేశాల్లో ఎమ్మెల్యేలు లేవనెత్తిన అనేక ప్రశ్నలను తిరస్కరిస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ మరో అంశంపై తీర్మానం చేసి సమస్యలను పక్కదారి పట్టించేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. కాగా బీజేపీ చేసిన ఆరోపణలను కాంగ్రెస్ నేత తారా ప్రసాద్ బాహిణీపతి తోసిపుచ్చారు.

దురదృష్టకరం

అసెంబ్లీలో ప్రధాన ప్రతిపక్షం నిత్యం సభను స్తంభింపజేస్తుండడం దురదృష్టకరమని ప్రభుత్వ చీఫ్ విప్ ప్రశాంత కుమార్ ముదులి ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీ సజావుగా సాగడంలో ప్రతిపక్షం కీలక పాత్ర పోషించాలని సూచించారు. ప్రశ్నోత్తరాల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రజల సమస్యలను చర్చించాలన్నారు. ఉద్దేశపూర్వకంగానే సభను స్తంభింపజేస్తున్నారని మండిపడ్డారు.

ఐఐటీ భువనేశ్వర్‌లో ఈ-రిక్షా సేవలు



ఈ-రిక్షా సేవలను ప్రారంభిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: స్థానిక ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) భువనేశ్వర్ క్యాంపస్‌లో ఎలక్ట్రిక్ రిక్షా సేవలను మంగళవారం ప్రారంభించారు. సంస్థ డైరెక్టర్ ప్రొఫెసర్ శ్రీపాద్ కర్మాల్కర్ ఈ సేవలను పచ్చజెండా ఊపి ప్రారంభించారు. నిరంతర పర్యావరణ అనుకూల రవాణాకు తన నిబద్ధతను ధ్రువీకరించడంలో భాగంగా ఈ సేవలను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఈ సేవల ప్రారంభోత్సవంలో రిజిస్ట్రార్ వామదేవ్ ఆచార్య, ఇన్‌చార్జి ప్రొఫెసర్ (రవాణా) డాక్టర్ సచ్చిదానంద రథ్, స్కూల్ ఆఫ్ ఎలక్ట్రికల్ సైన్సెస్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.రామ్ కుమార్ పాల్గొన్నారు. ప్రైవేటు టూర్స్ అండ్ ట్రావెల్స్ సంస్థతో ఐఐటీ భువనేశ్వర్ భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుని ఈ-రిక్షా సేవలను ప్రారంభించారు. ఈ కార్యక్రమం దేశవ్యాప్తంగా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం మరియు మిషన్ లైఫ్ ప్రచారంలో భాగంగా జీరో ఎమిషన్ క్యాంపస్ నినాద కార్యక్రమంలో ఇదో ముందడుగు అని పేర్కొన్నారు.

బనారస్ ఎక్స్‌ప్రెస్ సేవలు విస్తరణ

భువనేశ్వర్: రాష్ట్రంలో దక్షిణ మరియు పశ్చిమ జిల్లాల్లో రైలు సేవలను మెరుగుపరిచే దిశగా రైల్వే శాఖ మరో అడుగు ముందుకేసింది. రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ సంబల్‌పూర్ - బనారస్ ఎక్స్‌ప్రెస్ రైలు సేవలను విశాఖపట్నం వరకు పొడిగించడానికి ఆమోద ముద్ర వేయడం విశేషం. ఈ రైలు టిట్లాగఢ్ మరియు రాయగడ మీదుగా రాకపోకలు చేస్తోంది. సంబల్‌పూర్ నుంచి విశాఖపట్నం వరకు ఎక్స్‌ప్రెస్ రైలు సేవలు పొడిగించడం బహుళ ప్రయోజనాలు చేకూర్చుతుంది.

ఈ ప్రాంతాల నుంచి ప్రజలు తరచుగా పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లోని ప్రసిద్ధ ఆస్పత్రులకు ప్రయాణిస్తుంటారు. కాబట్టి నాణ్యమైన సత్వర ఆరోగ్య సంరక్షణ సేవలను సులభంగా పొందడం సాధ్యం అవుతుంది. విద్యా కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న విశాఖపట్నం ప్రాంతానికి విద్యార్థులకు రైలు రవాణా సదుపాయం అందుబాటులో ఉంటుంది. ఈ చర్యతో కొత్త వ్యాపార మరియు వాణిజ్య భాగస్వామ్యాలు బలం పుంజుకుంటాయి. తద్వారా ఆర్థిక వృద్ధికి దోహదపడుతుందని మంత్రి తెలిపారు. సంబల్‌పూర్ మరియు విశాఖపట్నం మధ్య రాకపోకలు చేసే ఈ రైలు పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జంక్షన్, హతియా, రాంచీ, రౌర్కెలా, ఝార్సుగుడ, సంబల్‌పూర్ వంటి కీలకమైన జంక్షన్‌ల గుండా పరుగులు తీస్తుంది.

అగ్నివీరులకు అభినందనలు



ఐఎన్‌ఎస్ చిలికాలో అగ్నివీర్ రెండో బ్యాచ్ పాసింగ్ అవుట్ పేరేడ్‌ను సదరన్ నేవల్ కమాండ్ ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్ వైస్ అడ్మిరల్ ఎం.ఎ.హంపిహోళి మంగళవారం సమీక్షించారు. ఐఎన్‌ఎస్ చిలికా పోర్టల్స్ నుంచి 448 మంది మహిళలతో సహా మొత్తం 2,895 మంది అగ్నివీరులు ఉత్తీర్ణులయ్యారు. ఈ కార్యక్రమంలో విజయం సాధించిన అగ్నివీరుల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు పేరేడ్ ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ కవాతుతో 16 వారాల కఠోర శిక్షణకు ముగింపు పలికింది. వైస్ అడ్మిరల్ హంపిహోళి అగ్నివీరులను అభినందించారు. నౌకాదళం ప్రధాన విలువలైన విధి, గౌరవం మరియు ధైర్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ప్రతిభ కనబరిచిన శిక్షణార్థులకు పతకాలు, ట్రోఫీలను అందజేశారు. ఓవరాల్ ఛాంపియన్ షిప్ ట్రోఫీ శివాజీ డివిజన్‌కు వరించింది. ద్విభాషా పత్రిక 'అంకుర్' శీతాకాలపు సంచిక ఆవిష్కరించారు.

- భువనేశ్వర్

ప్రభుత్వం రుణభారం రూ.88,487 కోట్లు

● ఆర్థిక శాఖ మంత్రి విక్రమ్ కేశరీ అరూఖ్

భువనేశ్వర్: ఈ ఏడాది జూలై నెలాఖరు నాటికి రాష్ట్ర రుణ భారం రూ.88,487.11 కోట్లుగా రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి విక్రమ్ కేశరీ అరూఖ్ శాసనసభలో మంగళవారం తెలియజేశారు. భండారి పొఖొరి నియోజకవర్గం బిజూ జనతా దళ్ సభ్యుడు ప్రఫుల్ల సామల్ అడిగిన ప్రశ్నకు ఆర్థిక మంత్రి లిఖితపూర్వక సమాధానంలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ ఏడాది జూలై 31 నాటికి రాష్ట్ర ప్రభుత్వ అప్పులు భారత ప్రభుత్వం వద్ద రూ.21,364.63 కోట్లు, ఎన్ఎస్ఎస్ఎఫ్‌లో రూ.5,465.57 కోట్లు, ఓపెన్ మార్కెట్‌లో రూ.19,558.07 కోట్లు, నాబార్డ్‌లో రూ.19,558.07 కోట్లు, జీబీసీలో రూ.1.28 కోట్లు, ఎస్‌సీడీఎఫ్‌తో రూ.579.70 కోట్లు, ఆర్ఈసీ మరియు ఇతరులతో రూ.247.93 కోట్లు రుణ భారం కొనసాగుతుండగా, జీపీఎఫ్ నుంచి రూ.23,254.21 కోట్ల అప్పు ఉందని మంత్రి తన సమాధానంలో వివరించారు. 2022-23 ఆర్థిక సంవత్సరం ముగిసే సమయానికి రాష్ట్ర ఆడిటర్ జనరల్ నివేదిక ప్రకారం రాష్ట్రం మొత్తం రుణ భారం రూ.88,164.82 కోట్లు మరియు తలసరి రుణ భారం రూ.19,992గా స్పష్టమైంది.

రత్న భాండాగారం కేసు విచారణ పూర్తి

● తీర్పు వాయిదా

భువనేశ్వర్: పూరీ శ్రీజగన్నాథ ఆలయం రత్న భాండాగారం కేసుకు సంబంధించి ఒడిశా హైకోర్టులో మంగళవారంతో విచారణ ముగిసింది. తీర్పును వెల్లడించడం వాయిదా వేసింది. కేసును ప్రధాన న్యాయమూర్తి శుభాసిస్ తలపాత్ర మరియు న్యాయమూర్తి సావిత్రి రాథోలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఓపికగా మరియు సుదీర్ఘంగా విచారణ నిర్వహించింది. తుది ఉత్తర్వులను రిజర్వ్‌లో ఉంచిందని పిటిషనర్ తరఫు న్యాయవాది పీతాంబర్ ఆచార్య తెలిపారు. ఆలయ భద్రతకు ముప్పు ఉందని, ఈ మేరకు చర్యలు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం, ఆలయ పరిపాలనా యంత్రాంగం సహకరించడం లేదని భారత పురావస్తు శాఖ (ఏఎస్ఐ) అఫిడవిట్ దాఖలు చేసింది. ఈ విచారణలో ప్రధానంగా రెండు అంశాలను లేవనెత్తినట్లు న్యాయవాది పీతాంబర ఆచార్య తెలిపారు. రత్న భండార్ మరమ్మతుల కోసం హైకోర్టు తక్షణమే ఉత్తర్వులు జారీ చేయాలని ఆయన ధర్మాసనానికి అభ్యర్థించారు. రెండోది రాష్ట్ర ప్రభుత్వం స్వామి రత్న భండార్ తాళం చెవి కోల్పోయింది. ట్రెజరీలో ఉండాల్సిన తాళం చెవి గల్లంతై తదుపరి దశలో రికార్డు రూమ్‌లో తారసపడింది. 1978 సంవత్సరం తర్వాత రత్న భండార్‌లో ఉంచిన నగలు మరియు రత్నాల వివరాల పరిశీలన, అనుబంధ జాబితా తయారీ నిర్వహించబడలేదు. గవర్నర్ నేతృత్వంలోని ఉన్నత స్థాయి కమిటీ ద్వారా ఈ ఆభరణాల జాబితాను సిద్ధం చేసేందుకు ఆదేశాలు జారీ చేయాలని ఉన్నత న్యాయ స్థానానికి అభ్యర్థించారు. ఈ నేపథ్యంలో న్యాయస్థానం తుది తీర్పుపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

రాష్ట్రవ్యాప్తంగా జైలు ఉద్యోగుల

నిరాహార దీక్షలు



బరంపురం: సర్కిల్ జైలు ప్రాంగణలో ఆందోళన చేస్తున్న జైలు ఉద్యోగులు

భువనేశ్వర్: తమ దీర్ఘకాల సమస్యల పరిష్కారానికి కారాగార సిబ్బంది రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపట్టారు. అఖిల ఒడిశా కారాగార కార్మిక మహా సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా జిల్లా జైళ్ల ఎదుట ఉద్యోగులు ధర్నాకు దిగారు. 12 రోజులుగా నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్నా, ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో నిరాహార దీక్షకు దిగారు. పూరీ జిల్లా కారాగారం ముందు ఆందోళనలో పాల్గొన్న జిల్లా జైలు చీఫ్ వార్డర్ కాలూ శెఠి మీడియాతో మాట్లాడుతూ తమ 5 పాయింట్ల చార్టర్ డిమాండ్లను ప్రస్తావిస్తూ ప్రభుత్వానికి మెమోరాండం సమర్పించినట్లు తెలిపారు. ఈనెల 13 నుంచి 24 వరకు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై శాంతియుతంగా నిరసన ప్రదర్శించారు. చాలా కాలంగా డిమాండ్ల సాధన కోసం ప్రభుత్వంతో చేపట్టిన సంప్రదింపులు ఫలించడం లేదని ఆందోళనకారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 25వ తేదీ నాటికి డిమాండ్లను నెరవేర్చేందుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో స్మారక పత్రంలో పేర్కొన్న ప్రకారం ఆమరణ నిరాహార దీక్ష చేపట్టినట్లు తెలిపారు. డిమాండ్లు నెరవేరే వరకు జైళ్ల శాఖ సిబ్బంది నిరాహార దీక్షలు కొనసాగిస్తారని శెఠి తెలిపారు. ఈ నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా ప్రభుత్వం బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. వార్డర్ల గ్రేడ్ పే రూ.1,900 నుంచి రూ.2,000, చీఫ్ వార్డర్ల గ్రేడ్ పే రూ.2,000 నుంచి రూ. 2,400, ఫుడ్ అలవెన్స్ రూ.400 నుంచి రూ.1,400, పాత ప్రమోషన్ స్కీమ్ అమలు, గ్రేడ్ పేతో పాటు కరువు భత్యం (డీఏ) జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

బరంపురం: తమ న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చాలని జైలు సంఘం జిల్లా అధ్యక్షుడు అజయ్ కుమార్ బొరియా కోరారు. మంగళవారం బరంపురం సర్కిల్ జైల్ ప్రాంగణంలో ఆల్ ఒడిశా జైలు ఉద్యోగస్తుల సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా అజయ్ కుమార్ బొరియా మాట్లాడుతూ.. జైలు ఉద్యోగుల గ్రేడ్ పే పెంచాలని, పదోన్నతి కల్పించాలని, 15 నెలల జీతం చెల్లించాలని, ఆహార కోటా పెంచాలని, జిల్లా పరిధిలో బదిలీలు చేయాలని కోరారు. తమ ప్రతిపాదనలు అమలు చేసేంతవరకు ఆందోళన కొనసాగుతుందని స్పష్టం చేశారు.

మల్కన్‌గిరి: జిల్లా సబ్ జైలు సిబ్బంది జైలు కార్యాలయం వద్ద మంగళవారం ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు.

జయపురం: స్థానిక సబ్ జైలులో ఉద్యోగులు దీక్షలు కొనసాగిస్తున్నారు. మంగళవారం దీక్షలో రాష్ట్ర అసోసియేషన్ కోశాధికారి దీప్తి రంజన్ మహింతి, రవీంద్ర కుమార్ చౌదరి, బికాశ బిసాయి, కరుణాకర భొయి, కె.బాబీరావు, లిప్స కుమార్ తదితరులు పాల్గొన్నారు. తమ డిమాండ్లు అంగీకరించేంత వరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు.



మల్కన్‌గిరి: జైలు వద్ద దీక్ష చేస్తున్న సిబ్బంది



జయపురం: సబ్ జైలులో దీక్షలు చేస్తున్న సిబ్బంది



భువనేశ్వర్: పూరీ జిల్లా జైలు ముందు ఉద్యోగుల నిరాహార దీక్ష

విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి



పలాస మార్చురీలో కుమ్మరి సురేష్ మృతదేహం

కాశీబుగ్గ: పలాస మండలం లొద్దబద్ర పంచాయతీ సున్నాడ గ్రామంలో కుమ్మరి సురేష్ (27) అనే యువకుడు మంగళవారం విద్యుత్ షాక్ తగిలి కిందపడి మృతి చెందాడు. గ్రామంలో వినాయక అన్నదాన కార్యక్రమానికి ఇంటింటికీ బియ్యం సేకరణ కోసం వాహనంపై వెళ్తుండగా వాహనానికి విద్యుత్ తీగలు తగిలాయి. దీంతో సురేష్ ఒక్కసారిగా కిందకు పడిపోయాడు. తల వెనుక భాగానికి రోడ్డు గట్టిగా తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మిగిలిన వారికి ఏమీ కాలేదు. ఇటుకలు తయారు చేసి జీవనం గడుపుతున్న ఆ కుటుంబానికి కుమారుడే ఆధారంగా భావిస్తున్నారు. కుమారుడి మృతి వార్త తెలిసి తల్లిదండ్రులు సింహాద్రి, అన్నపూర్ణ కన్నీరుమున్నీరయ్యారు. మృతదేహాన్ని పలాస ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రభుత్వ బియ్యం పంపిణీలో వాహన చోదకుడిగా ఉన్న సురేష్ మరణించడంతో గ్రామమంతా విషాదంలో మునిగిపోయింది.

ఉత్సాహంగా జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు



గ్రిగ్స్ మీట్ సెక్రటరీ కె.మాధవరావును సత్కరిస్తున్న డిప్యూటీ ఈఓ తిరుమల చైతన్య, ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. జిల్లా విద్యాశాఖ పరిధిలోని జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శ్రీకాకుళంలో జరుగుతున్న జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీల్లో భాగంగా రెండో రోజు కూడా బాల బాలికలు అదిరేటి ఆటతీరును కనబరిచారు. ముఖ్యంగా అండర్-17 బాలుర పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. రెండో రోజు మంగళవారం ఏడు క్రీడాంశాల్లో ఎంపిక పోటీలు జరిగాయి. ఇందులో బాల్‌బ్యాడ్మింటన్, స్విమ్మింగ్, షటిల్ బ్యాడ్మింటన్, టేబుల్‌టెన్నిస్, సాఫ్ట్‌బాల్, తైక్వాండో, ఫెన్సింగ్ క్రీడాంశాల్లో ఎంపికలు జరిగాయి. స్విమ్మింగ్ ఎంపికలు శాంతినగర్ కాలనీలోని డీఎస్ఏ సిమ్మింగ్ పూల్ వేదికగా జరిగాయి. అలాగే టేబుల్ టెన్నిస్ ఎంపికలు శ్రీకాకుళం పీఎన్ కాలనీలోని న్యూసెంట్రల్ స్కూల్ వేదికగా జరిగాయి. తైక్వాండో, ఫెన్సింగ్ ఎంపికలు శ్రీకాకుళం టౌన్‌హాల్ వేదికగా జరిగాయి. షటిల్ బ్యాడ్మింటన్ ఎంపికలు శాంతినగర్ కాలనీలోని డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో జరిగాయి. ఈ ఎంపికలు జరుగుతున్న తీరును డీఈఓ కె.వెంకటేశ్వరరావు సంబంధిత అధికారులను ఎప్పటికప్పుడు అడిగి తెలుసుకుంటున్నారు. జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి బీవీ రమణ, పీఈటీ సంఘ నాయకులు ఎంవీ రమణ, ఎం.సాంబమూర్తి, కె.మాధవరావు తదితరులు పర్యవేక్షించారు.

క్లుప్తంగా

నేడు గిరిజన సాధికారతపై అవగాహన సదస్సు

పార్వతీపురంటౌన్: షెడ్యూల్ తెగ (ఎస్టీ) సాధి కారత, అత్యాచారాల నియంత్రణ తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని ఈనెల 27వ తేదీన నిర్వహిస్తున్నట్లు సీఐడీ విశాఖ ప్రాంతీయ కార్యాలయం డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఎంఎస్ గోపాల్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ అవగాహన సదస్సు పార్వతీపురంలోని ఐటీడీఏ గిరిమిత్ర సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సదస్సులో రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు, కలెక్టర్ నిశాంత్ కుమార్, ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఐటీడీఏ పీఓ సి.విష్ణు చరణ్ హాజరవుతారని పేర్కొన్నారు. గిరిజనులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ అవగాహన సదస్సును సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

విజయనగరం క్రైమ్: స్థానిక లంకవీధికి చెందిన మహిళ గండిబోయిన రాధిక(32) అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. టూటౌన్ పరిధిలో సోమవారం రాత్రి జరిగిన ఈ సంఘటనకు సంబంధించి ఎస్సై ప్రసన్నకుమార్ మంగళవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాధిక భర్త రెండేళ్ల క్రితం మృతిచెందాడు. అప్పటి నుంచి మరో వ్యక్తితో సహజీవనం సాగిస్తున్న ఆమె గర్భం దాల్చడం, ఆరోగ్య పరిస్థితి సహకరించకపోవడంతో ఇబ్బందులు పడుతోంది. యథావిధిగా సోమవారం రాత్రి ఇంటికి వెళ్లి చూసేసరికి అప్పటికే రాధిక మృతిచెంది ఉన్నట్లు ఆమెతో సహజీవనం సాగిస్తున్న వ్యక్తి పోలీసులకు తెలిపాడు. అయితే ఆమె ఎలా మృతిచెందిందన్న విషయం తెలియరాలేదని పోలీసులు స్పష్టం చేశారు. మృతురాలి సోదరి పార్వతి ఫిర్యాదు మేరకు టూటౌన్ ఎస్సై ప్రసన్నకుమార్ అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

ఎస్.కోటలో ఓ ఫంక్షన్‌కు వెళ్లి తిరిగి జామి మీదుగా కోరుకొండ వచ్చి కోరుకొండపాలెం వెళ్తుండగా బైక్‌పై అకస్మాత్తుగా వచ్చిన ఇద్దరు వ్యక్తులు గొలుసు లాక్కుని పరారయ్యారు. ఈ మేరకు కోరుకొండ గ్రామానికి చెందిన సత్యవతి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై రూరల్ ఎస్సై గణేష్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాన్ బోల్తాపడి చేపల వ్యాపారి మృతి



మృతుడు జాన నరసింహులు (ఫైల్)

భోగాపురం: మండలంలోని సుందరపేట జాతీయ రహదారిపై వ్యాన్ బోల్తా పడి శ్రీకాకుళం జిల్లా సారవకోట గ్రామానికి చెందిన చేపల వ్యాపారి జాన నరసింహులు(32) మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నరసింహులు చేపల వ్యాపారం చేసుకుంటూ కుటుంబంతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో విశాఖపట్నంలో చేపలు కొనుగోలు చేసుకుని వ్యాన్‌లో శ్రీకాకుళం వెళ్తుండగా వ్యాన్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నరసింహులు కింద పడిపోవడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికుల సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని స్థానిక సుందరపేట సీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచనల మేరకు తగరపువలస ఎన్ఆర్ఐ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి భార్య నీలవేణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై కృష్ణమూర్తి తెలిపారు.

110 లీటర్ల సారా పట్టివేత



వంద లీటర్ల సారాతో పట్టుబడిన వ్యక్తి

సీతంపేట: మండలంలోని కేపీ ఈతమానుగూడకు చెందిన సవర కామేశు అక్రమంగా 100 లీటర్ల సారా తరలిస్తుండగా మంగళవారం పట్టుకున్నామని ఎస్సై ఎ.నీలకంఠరావు తెలిపారు. అలాగే గొయిది గ్రామ సమీపంలో సవర అనిత సారా విక్రయిస్తుండగా 10 లీటర్లు పట్టుకున్నామని, నిందితులు ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించామని చెప్పారు.

శ్రీనివాసునికి పంచామృతాభిషేకాలు

విజయనగరం రూరల్: మండలంలోని దుప్పాడ గంగానగర్‌లో కొలువై ఉన్న శ్రీ అష్టలక్ష్మి సమేత ఐశ్వర్య వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీనివాసునికి మంగళవారం పంచామృతభిషేకాలు నిర్వహించారు. శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని దేవాలయ అర్చకులు చామర్తి శ్రీనివాస రమేష్ ఆచార్యులు, చామర్తి రమేష్ ఆచార్యులు సంయుక్తంగా వేద మంత్రాల నడుమ శ్రీనివాసునికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఉత్సవంలో దేవాలయ ధర్మకర్తలు దుర్గాబాలాజీ, ఉమాదేవి దంపతులు, నీరజమ్మ, భక్తులు పాల్గొన్నారు.



వర్షపు నీటితో నిండిన పట్టణ శివారులోని చెరువు

కరుణించిన వరుణుడు

- మూడు నెలల్లో 57 రోజుల పాటు వర్షాలు
- 8 మండలాల్లో సాధారణానికి మించి నమోదు
- అన్ని మండలాల్లోనూ సాధారణ వర్షపాతం
- నాట్లు పడిన పంటలకు ప్రాణం




విజయనగరంలో కురుస్తున్న వర్షం

విజయనగరం అర్బన్: పంటలు వాడిపోతున్న తరుణంలో వరుణుడు కరుణించి కుంభవృష్టి కురిపించాడు. గడిచిన వారం రోజులుగా జిల్లాలో ప్రతి రోజూ సాయంత్రమయ్యేసరికి భారీగా వర్షం కురుస్తోంది. దీంతో పలు ప్రాంతాల్లో చెరువులు నిండిపోయి, వాగులు, వంకలు పొంగిపొర్లాయి. గడిచిన మూడు నెలలకు రికార్డుస్థాయిలో 711 మి.మీ. వర్షపాతం జిల్లాలో నమోదు కావడం విశేషం. ఈ నేపథ్యంలో జిల్లాలో సాగునీటి నిల్వలు పెరిగాయి. జూలై, సెప్టెంబర్ నెలల్లో సాధారణ వర్షపాతం కంటే అధికంగా వర్షపాతం నమోదైంది. మూడు నెలలకు సంబంధించి 90 రోజుల్లో 57 రోజులపాటు సరాసరి వర్షం కురిసింది. జిల్లాలోని 27 మండలాల్లో 14 మండలాల్లో 40 రోజులకు పైగా వర్షం కురిసింది. రేగిడి ఆమదాలవలస, బాడంగి, తెర్లాం, గజపతినగరం, చీపురుపల్లి, బొండపల్లి, ఎస్.కోట, జామి మండలాల్లో సాధారణ వర్షపాతం కంటే అధికంగా కురిసింది. మిగిలిన అన్ని మండలాల్లో ఆయా మండలాలకు సరిపడా సాధారణ వర్షపాతం నమోదైంది. మూడునెలల సాధారణ వర్షపాతం 640.8 మీ.మీ కాగా 711.1 మి.మీ. వర్షపాతం నమోదైంది. తాజాగా సోమవారం విజయనగరంలో 31.4 మి.మీ, గంట్యాడలో 29.2 మి.మీ, డెంకాడలో 27.6 మి.మీ. వర్షం కురిసింది.

ప్రాణం పోసుకున్న నాట్లు

జిల్లాలో కొద్ది రోజుల ఆలస్యంగానైనా భారీగా వర్షాలు కురవడంతో వివిధ పంటలు కోలుకునే అవకాశం ఏర్పడింది. జిల్లాలో దాదాపు అన్ని మండలాల్లోనూ వరిపంట సాగుచేస్తారు. ఇప్పటికే 60 శాతం నాట్లు పడిన పంటలకు ఈ వర్షాలు ప్రాణం పోశాయని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు పడడం కొంచెం ఆలస్యమైన మండలాల్లో వరికి ప్రత్యామ్నాయ పంటల సాగుకు అవకాశం ఏర్పడింది. వ్యవసాయ శాఖ కూడా ప్రత్యామ్నాయ పంటల సాగుకు ఇప్పటికే కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసింది. జిల్లాలో 2.5 లక్షల హెక్టార్లకు పైగా భూముల్లో వరినాట్లు పడ్డాయి. చాలాప్రాంతాల్లో కొద్దిరోజులు ఆలస్యమైనా వరి నాట్లకే రైతులు ప్రాధాన్యం ఇస్తున్నారు. కొన్ని ప్రాంతాలో కొత్తగా జొన్న, సజ్జ, కంది, చోడి వంటి ప్రత్నామ్నాయ పంటలు వేస్తున్నారు.

పుష్పాలంకరణలో పైడితల్లి



ప్రత్యేక పుష్పాలంకరణలో పైడితల్లి అమ్మవారు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజామునుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, మూలా పాపారావులు శాస్త్రోక్తంగా పూజాదికాలు చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయం వెనుక ఉన్న వేప, రావిచెట్ల వద్ద దీపారాధన చేశారు. ఆలయ ఈఓ కేఎల్.సుధారాణి కార్యక్రమాలను పర్యవేక్షించారు. అధికసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి, తరించారు.

గోవిందునికి చక్రస్నానం

- శాస్త్రోక్తంగా మహా పూర్ణాహుతి
- ధ్వజారోహణంతో ముగిసిన బ్రహ్మోత్సవాలు



యాగశాలలో పూర్ణాహుతి చేస్తున్న అర్చకులు



రామపుష్కరిణిలో స్వామివారికి చక్రస్నానం జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతా రామస్వామివారి పుష్కరిణిలో శ్రీ వేంకటేశ్వరస్వామి చక్రస్నానం మంగళవారం వైభవంగా జరిగింది. గడిచిన తొమ్మిది రోజులుగా రామతీర్థం దేవస్థానంలో అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన శ్రీ వేంకటేశ్వరస్వామివారికి జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా అర్చకులు స్వామివారికి చక్రస్నానం జరిపించారు. ఈ నేపథ్యంలో వేకువజామున స్వామివారి ప్రాతఃకాలార్చన అనంతరం యాగశాలలో సుదర్శన స్వామిని వేంచేపుచేసి పూర్ణాహుతి, విశేష హోమం జరిపించారు. అనంతరం స్వామివారి సుదర్శన పెరుమాళ్లను ఊరేగింపుగా తీసుకువెళ్లి రామపుష్కరిణి ప్రధాన్ ఘాట్ వద్ద ఆశీనులను చేశారు. వేద మంత్రోచ్చారణ, మంగళ వాయిద్యాల నడుమ స్వామివారి సుదర్శన పెరుమాళ్లకు విశేష అర్చన చేసి చక్రస్నానాన్ని వైభవంగా జరిపించారు. తరువాత ఊరేగింపుగా ఆలయం వెలుపలకు స్వామివారిని తీసుకువెళ్లి బాలభోగం, గ్రామ బలిహరణ, మంగళాశాసనం కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం ధ్వజారోహణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించి శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ముగింపు పలికారు. బ్రహ్మోత్సవాల ప్రారంభం రోజున ధ్వజస్తంభంపై ఎగురవేసిన గరుత్మంతుడు చిత్రపటాన్ని ప్రత్యేక పూజల నడుమ అర్చకులు కిందికి దించారు. బుధవారం స్వామికి పుష్పార్చన, ద్వాదశారాధన, సప్తావరణ సేవ జరగనుంది. కార్యక్రమంలో అర్చకులు సాయి రామాచార్యులు, నరసింహాచార్యులు, కిరణ్, పవన్, దేవస్థానం సిబ్బంది, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు రాజాం విద్యార్థిని



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినితో ఉపాధ్యాయులు

రాజాం సిటీ: శ్రీకాకుళంలో ఈ నెల 25న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆర్చరీ పోటీల్లో ప్రతిభ కనబరిచిన రాజాం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని పైల రమ్య రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు మంగళవారం ఆమెను అభినందించారు. రమ్య చక్కని ప్రతిభకనబర్చిందని పాఠశాల కార్యదర్శి బీవీ అచ్యుత్‌కుమార్, బి.శంకరరావులు ప్రశంసిస్తూ త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందని చెప్పారు. ఆమెతో పాటు శిక్షణ ఇచ్చిన పీడీ బి.శ్రీనివాసరావును అభినందించారు. కార్యక్రమంలో ఎస్ఏ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్ల ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన జిల్లాబాలబాలికల జట్లతో ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రీనివాసరావు, హెచ్‌ఎం తదితరులు

బాడంగి: ఈనెల 30వతేదీన నంద్యాల జిల్లాలో జరగనున్న అండర్ 16 బాల్‌బ్యాడ్మింటన్ రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్ల ఎంపిక పూర్తయినట్లు వాడాడ హెచ్‌ఎం జి.సుందరరావు చెప్పారు. ఈ మేరకు మండలంలోని వాడాడ హైస్కూల్‌మైదానంలో జిల్లాస్థాయి బాల్ బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు మంగళవారం జరిగాయి. జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి టి.శ్రీనివాసరావు పర్యవేక్షణలో జరిగిన ఈ పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి సుమారు 72మంది బాల బాలికలు పాల్గొన్నారని హెచ్‌ఎం చెప్పారు.

ఎంపికైన బాలుర జట్టు: జి.భరత్, ఐ.శ్రీరామ్, ఎస్ఎంఎల్.సాయి, టి.సాయితేజ, ఎస్.చంద్రమౌళి, ఎల్.చరణ్, డి.సురేష్, కె.ఆదిత్య, ఎ.దిలీప్,పి.గణేష్

బాలికలజట్టు: ఎం.హరిణి, ఎం.భావన, పి.భారతి, కె.తనూజ, సీహెచ్.మాధురి, బి.కవిత, ఎం.రమ్య, వి.అంజలి, ఎస్.మాధవి, భవాని.

తైక్వాండో పోటీలకు జిల్లా జట్లు సిద్ధం

- అండర్-19 స్కూల్‌గేమ్స్ రాష్ట్ర పోటీలకు 19మంది ఎంపిక



రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో కడపలో జరగనున్న అండర్ -19 స్కూల్ గేమ్స్ బాల, బాలికల తైక్వాండో పోటీలకు జిల్లా జట్లు సిద్ధమయ్యాయి. ఈ మేరకు జిల్లా స్థానిక రాజీవ్ క్రీడా మైదానంలో మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలకు వివిధ యాజమాన్యాల పాఠశాలలకు చెందిన 19 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన బాల, బాలికలు 50 మంది హాజరయ్యారు. వారికి ఎంపిక పోటీలు నిర్వహించగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన 11 మంది బాలికలు, 8 మంది బాలురు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు అసోసియేషన్ కార్యదర్శి పీవీఎల్ఎస్. కృష్ణ తెలిపారు. ఎంపిక పోటీలను పలువురు తైక్వాండో కోచ్‌లు, పీడీలు పర్యవేక్షించారు.

5న విశాఖలో 'ఉక్కు' పరిరక్షణ బహిరంగ సభ

విజయనగరం ఫూల్‌బాగ్: విశాఖ ఉక్కు పరిశ్రమను పరిరక్షించేందుకు సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 20 నుండి ఉత్తరాంధ్ర బైక్ యాత్ర సాగుతుందని, ముగింపుగా అక్టోబర్ 5న విశాఖ కూర్మన్నపాలెం వద్ద భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని సీపీఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు కోరారు. ఆ సభకు సీపీఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి హాజరవుతారని తెలిపారు. నగరంలోని మార్కెట్ కలాశీల వద్ద మంగళవారం జరిగిన ప్రచార సభలో సభకు సంబంధించిన కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయడం దుర్మార్గమన్నారు. 32మంది ప్రాణత్యాగాలు, వీరోచిత పోరాటంతో సాధించుకున్న ఉక్కు పరిశ్రమను కారుచౌకగా కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు కేంద్రంలో బీజేపీ కుట్ర పన్నుతుందని విమర్శించారు. విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలని, నిర్వాసితులకు ఉద్యోగాలు ఇవ్వాలని, ఖాళీగా ఉన్న ఐదు వేల పోస్టులను భర్తీ చేయాలని, పరిశ్రమ నిర్వహణకు రూ.5వేల కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపేంత వరకు సీపీఎం పోరాడుతుందని అన్నారు. బహిరంగ సభలకు కార్మికులంతా కదలి రావాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ నగర కార్యదర్శి బి.రమణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మేస్త్రి బంగారప్పుడు, గౌరీ, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ లేని బయోఫెర్టిలైజర్స్ విక్రయించరాదు

- జిల్లా వ్యవసాయాధికారి తారకరామారావు



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి తారకరామారావు

విజయనగరం ఫోర్ట్: ప్రిన్సిపల్ సర్టిఫికెట్ లేకుండా బయోఫెర్టిలైజర్స్, బయోప్రొడక్ట్స్ విక్రయించకూడదని జిల్లా వ్యవసాయ అధికారి వి. తారకరామరావు అన్నారు. ఈ మేరకు స్థానిక జిల్లా వ్యవసాయ కార్యాలయంలో మంగళవారం ఆయన క్రిమిసంహారక మందులు, బయో ఫెర్టిలైజర్స్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంఆర్‌పీ కంటే అధికంగా విక్రయిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రిన్సిపల్ సర్టిఫికేట్ కచ్చితంగా లైసెన్స్‌తో కలిపి ఉండాలన్నారు. కాలపరిమితి దాటిన క్రిమిసంహారక మందులను తీసివేసి మందుగానే పక్కన పెట్టాలని హితవు పలికారు. అలాకాకుండా వాటిని విక్రయిస్తే తగిన చర్యలు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ధరలు, స్టాకు వివరాలు తెలిపే బోర్డులు దుకాణాల వద్ద ఏర్పాటు చేయాలని చెప్పారు. సమావేశంలో మండల వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరావు తతితరులు పాల్గొన్నారు.

మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలి

- డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్

పార్వతీపురంటౌన్: మహిళలు వ్యాపార వేత్తలుగా ఎదిగి లక్షాధికారులుగా మారాలని డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన జిల్లా కేంద్రంలో గల వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో సీసీలు, పీఓఏలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నీ మహిళా సంఘాల సభ్యులకు ఎంతో ఉపయోగపడుతున్నా యన్నారు. వాటిపై మహిళలకు గ్రామస్థాయిలో అవగాహన కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ద్వారా వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, జగనన్న తోడు, స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ, సీఐఎఫ్, హెచ్‌డీఐఎఫ్ ఉన్నతి వంటి పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ పథకాల గురించి సిబ్బంది గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. మహిళలు ఆర్థికంగానే కాకుండా వ్యాపార వేత్తలుగా ఎదిగేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తోందని చెప్పారు. మహిళలు తయారు చేసిన ఉత్పత్తులతో మహిళా మార్టులు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. ప్రతి మహిళా సంఘం సభ్యురాలు వాటాధనం సకాలంలో చెల్లించాలని కోరారు. ప్రాజెక్టు నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తిచేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఎం పి.సురేష్, ఎఫ్ఎన్‌హెచ్‌డబ్ల్యూ ఏపీఎం త్రినాథమ్మ, చేయూత ఏపీఎం సతీష్, మండల సమాఖ్య కార్యదర్శి వై.జగదీశ్వరరావు, సీసీలు, పీఓఏలు తదితరులు పాల్గొన్నారు.

మృతదేహాల అప్పగింత

బొబ్బిలి: పెట్రోల్ బంకులోని అండర్ ట్యాంకులో విషవాయువు ప్రభావంతో ఊపిరాడక మృతిచెందిన ఇద్దరిలో చింతాడ గ్రామానికి చెందిన పోలినాయుడు మృతదేహాన్ని కుటుంబసభ్యులకు పోలీసులు మంగళవారం అప్పగించారు. మరో మృతుడు అజిత్ కుమార్ ఉరఫ్ అన్ను (18) కుటుంబ సభ్యులు పాట్నాలో బయల్దేరారని, బుధవారానికి బొబ్బిలి చేరుకుంటారని, మృతదేహాన్ని సీహెచ్‌సీలోని మార్చురీలో భద్రపరిచామని పోలీసులు చెప్పారు. మృతుల కుటుంబసభ్యులకు నష్ట పరిహారం అందజేసినట్లు తెలిసింది.

పేరాపురంలో ఎరువులు, పురుగుమందుల సీజ్

- ఆకస్మికంగా తనిఖీ చేసిన మండలవ్యవసాయ అధికారి



షాపులో పురుగుమందులను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి నీలిమ

పూసపాటిరేగ: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా, అనుమతిలేకుండా మండలంలోని పేరాపురంలో గల ఎరువుల షాపులో ఉన్న రూ.లక్షా 30 వేల విలువైన ఎరువులు, పురుగుమందులను సీజ్ చేసినట్లు మండల వ్యవసాయ అధికారి కె.నీలిమ తెలియజేశారు. ఈ మేరకు మంగళవారం ఆమె మాట్లాడుతూ పేరాపురంలోని వెంకటేశ్వర ట్రేడర్స్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశామని తెలిపారు. ఈ సందర్భంగా షాపులో రూ.39,775 విలువైన బయోఫేక్టర్ ఎన్‌సీకె, రూ.13,975 విలువైన ఫాస్ఫేట్ ఆర్గానిక్, రూ.22,425 విలువైన బయోపొటాష్, రూ.54,110 విలువైన నోకాష్, తేజస్వి, కార్గిల్, తేజల్ పురుగుమందులకు అనుమతులు లేకపోవడంతో సీజ్ చేసి స్టాప్‌సేల్ చేసినట్లు చెప్పారు. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు ఆయా ఎరువులు, పురుగుమందుల విక్రయాలు నిలుపుదల చేసినట్లు వివరించారు.

పేర్లు ఉన్నా.. ఊళ్లు మాయం..!



మొదటికెల్ల గ్రామ రెవెన్యూ పరిధిలో ఉన్న భూమి

- రికార్డుల్లో మాత్రం శ్రీహరిపురం, మొదటికెల్ల రెవెన్యూ గ్రామాలు
- భూముల క్రయవిక్రయాల్లోనే వాడుతున్న గ్రామాల పేర్లు
- రెండు గ్రామాల్లో 647 ఎకరాల భూములు



రికార్డుల ప్రకారం శ్రీహరిపురం గ్రామం

వీరఘట్టం: భౌతికంగా ఆ రెండు ఊళ్లు కనిపించవు. ఇంకా చెప్పాలంటే ఆ గ్రామాలు ఉన్నట్లు స్థానికులకే తెలియదు. రెవెన్యూ రికార్డుల్లో మాత్రం ఆ రెండు ఊళ్లు భద్రంగా ఉన్నాయి. భూముల క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్లు వంటి కార్యకలాపాలన్నీ ఆ రెండు గ్రామాల పేరిటే కొనసాగుతున్నాయి. ఈ కథాకమామిషు ఇలా ఉంది. వీరఘట్టం మండలంలోని చిట్టపులివలస సచివాలయం పరిధిలో విక్రమపురం, చిట్టపులివలస, శ్రీహరిపురం, మొదటికెల్ల రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. అయితే మొదటి రెండు ఊళ్లలో వేలసంఖ్యలో జనాభా కూడా నివసిస్తున్నారు. మిగిలిన రెండు గ్రామాలు శ్రీహరిపురం, మొదటికెల్లకు ప్రత్యేకత ఉంది. ఈ గ్రామాలు ఉన్నట్లు ఎక్కడా కనపడవు. కానీ రికార్డుల్లో మాత్రం ఈ ఊర్ల పేర్లు కొనసాగుతున్నాయి. బ్రిటిష్ కాలంలో ఈ రెండు గ్రామాలు అగ్రహారాలుగా ఉండేవని, వందేళ్ల క్రితం ఆయా గ్రామాల్లో ప్రజలు ఉండేవారని..కాలక్రమేణా వారు ఇతర ప్రాంతాలకు వెళ్లిపోవడంతో ఊళ్లు ఖాళీ అయ్యాయని చెబుతున్నారు. అధికారికంగా అప్పట్లో రికార్డుల్లో నమోదై ఉండడంతో ఆ పేర్లతోనే నేటికీ గ్రామాలు కొనసాగుతున్నాయి.

ఇదీ విషయం..

వీరఘట్టం మండలంలో 41 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. వాటిలో అన్ని గ్రామాలు భౌతికంగా ఉన్నప్పటికీ శ్రీహరిపురం, మొదటికెల్ల గ్రామాలు మాత్రం కనుమరుగయ్యాయి. ఈ రెండు గ్రామాలు నడుకూరు, చిట్టపులివలస, విక్రమపురం, నడిమికెల్ల గ్రామాలకు మధ్యలోనే ఉన్నట్లు రికార్డులు చెబుతున్నాయి. శ్రీహరిపురం పరిధిలో సుమారు 280 ఎకరాలు, మొదటి కెల్ల పరిధిలో 367 ఎకరాలకు పైగా భూములు ఉన్నాయి. ప్రస్తుతం నడుకూరు పాలకేంద్రం నుంచి విక్రమపురం వరకు, చిట్టపులివలస గ్రామానికి సమీపంలో ఉన్న చింతచెట్టు నుంచి విక్రమపురం వరకు ఉన్న భూములన్నీ శ్రీహరిపురం రెవెన్యూ పరిధిలో ఉన్నాయి. అలాగే విక్రమపురం దాటిన తర్వాత నడిమికెల్ల ముందు వరకు విక్రమపురం నుంచి సమీపంలో ఉన్న నాగావళి నది వరకు ఉన్న భూములు మొదటికెల్ల రెవెన్యూ పరిధిలో ఉన్నాయి.

ఆ గ్రామాల పేర్లతోనే రిజిస్ట్రేషన్లు



చందక సత్యనారాయణ, తహసీల్దార్, వీరఘట్టం

ప్రస్తుతం నడుకూరు, విక్రమపురం, చిట్టపులివలస గ్రామస్తుల భూములన్నీ శ్రీహరిపురం, మొదటికెల్ల రెవెన్యూ పరిధిలోనే ఉన్నాయి. మీ భూమి పోర్టర్‌లోనూ ఇవే కనిపిస్తాయి.ఆ ప్రాంతాల్లోని భూముల క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్లు చేయిస్తే పాత గ్రామాల పేరిటే ప్రక్రియ కొనసాగుతోంది.

647 ఎకరాల భూములు ఉన్నాయి

మండలంలోని శ్రీహరిపురం, మొదటికెల్ల రెవెన్యూ గ్రామాలు భౌతికంగా లేవు. అయితే రెవెన్యూ రికార్డుల్లో మాత్రం ఈ రెండు గ్రామాల్లో 647 ఎకరాల భూములు ఉన్నాయి.ఇటీవల భూ సర్వే కూడా చేపట్టాం. ప్రభుత్వ సంక్షేమ పథకాలు కూడా ఇవే గ్రామాల పేర్ల మీద వస్తున్నాయి.